
# అభిమాన రచయిత

## లంక ఫణీందర్



మధ్యాహ్నం రెండు దాటి ఏభై నిముషాలైంది. పది నిముషాలు ముందుగానే వచ్చి ఆగిన అమరావతి ఎక్స్‌ప్రెస్ [హుబ్లి నుంచి గుంటూరు వెళ్ళే రైలు] అయిదు నిముషాలు ఆలస్యంగా హొస్‌పేట జంక్షన్ నుంచి కదిలింది.

రైలుతో పాటు తనూ కదులుతూ, తన చేతిలోని నా చేతిని సున్నితంగా నొక్కుతూ ఎన్నోసార్లు చెప్పిన ఆ మాటల్నే చివరిసారిగా మళ్ళీ చెప్పాడు చంద్ర.

"జాగ్రత్తరా ప్రసన్ ! టెస్ట్ బాగా రాయి. నీ ప్రిపరేషన్ బావుంది కాబట్టి పెద్ద కష్టం అనిపించకపోవచ్చు. జర్నీలో జాగ్రత్త సుమా !"

రైలు వేగా న్నందుకొంది. తన చేతి నుంచి విడిపడిన నా చేతిని గాల్లో ఊపాను. వాడూ చేయూపాడు. ఒకరి కొకరం కనుమరు గయ్యేవరకు అలా చేతు లూపుకుంటూనే ఉన్నాం.

రైలు స్టేషన్ దాటాక, తలుపు దగ్గర్నుంచి కదిలి లోపలికి నడిచాను. దాదాపు ఆ కంపార్ట్‌మెంట్ అంత ఖాళీగానే ఉంది. కోటా కోచ్ అవడంవల్ల ఒకో స్టేషన్‌లో కొంతమంది చొప్పున ఎక్కుతుంటారు. గుంతకల్ చేరాక గాని అది పూర్తిగా నిండదు.

సీట్లో కెళ్ళి కూర్చున్నాక, బాగ్ లోంచి ఇందాకే స్టేషన్‌లో కొన్న కొత్త 'కరీర్ అండ్ కాంపిటీషన్ టైమ్స్' సంచికను తీశాను. కిటికీ పక్క సీటు నాది. రైలు వేగంగా కదులుతూంటే, కిటికీలోంచి తెరలు తెరలుగా వస్తూన్న చల్లని గాలికి నా తల వెంట్రుకలు రెపరెపలాడుతున్నాయి. చాలా గమ్మత్తైన హాయి అది. ఆ హాయిని అనుభవిస్తూ పుస్తకంలోని ఒక్కో పేజీని తిరగేయసాగాను. అలా తిరగేస్తూనే నా ముందు కూర్చున్న వారిని పరిశీలించాను.

నేను కాక చిన్న కాబిన్‌లో మరో నలుగు రున్నారు; నలుగురూ నా ఎదురుగా ఉన్న ఫోర్ - సీటర్‌లో కూర్చున్నారు. వారిలో ఇద్దరు అమ్మాయిలు. పది, పది పదకొండే ళ్ళుంటాయ్ వారికి. మేకపిల్లల్లా ఆ కోచ్ అంతా తిరుగుతూ అల్లరి చేస్తున్నారు. ఒక ముసలావిడ, వారి నాయనమ్మో కాబోలు, వారిని ఓ చోట కూర్చోబెట్టడానికి నానా అవస్థా పడుతోంది. ఇవేవీ పట్టనట్టు గంభీరంగా కూర్చొనున్నాడు వాళ్ళ ఫాదర్. కాలు మీద కా లేసుకొని, పై కాలుమీద మోచేయి ఉంచి, ఆ అరచేతిని గెడ్డానికి ఆన్చి, కిటికీలో నుండి బయటికి చూస్తున్నాడు. అతని ముఖం చూస్తే దేని గురించో తీవ్రంగా ఆలోచిస్తున్నట్టు ఉంది.

అతను పసుపుపచ్చ పాంటు మీద అదే రంగు జుబ్బా వేసుకున్నాడు. నీట్‌గా ఇస్త్రీ చేసిన సిల్కు జుబ్బా తళతళా మెరుస్తోంది. చాలా తక్కువమంది ఇష్టపడే రంగు ఎల్లో. అలాంటిది కిందనుంచి పైవరకు అదే రంగు ఉపయోగించాడంటే ఏదో ప్రత్యేకత కలవాడై ఉండాలి. బహుశా తెలుగుదేశం పార్టీ మెంబరేమో? చేతిలో కొత్త పత్రిక ఉండటంతో వారి గురించి ఆలోచించడం మానేసి పుస్తకంలో తల దూర్చాను.

'హలో ఫోక్స్...' చదివాక కరెంట్ అఫైర్స్ తిరగేశాను. అన్నీ ఇంతకుముందు పేపర్లో చదివినవే. తరవాత ఆబ్జెక్టివ్ జి.కె. తిరగేశాను. అవీ దాదాపు అన్ని తెలిసినవే. అదయ్యాక ఇంగ్లీష్ కాంప్రెహెన్సేషన్ తిరగేస్తూంటే వినిపించింది.

"హేయ్ ! లేళ్ళు !"

"హాయ్ జింకలు !" పుస్తకంలో నుంచి తలెత్తాను. ఎల్లో శాల్టీ తాలూకు పిల్ల లిద్దరూ కిటికీ ఊచలు పట్టుకొని ఉత్సాహంగా బయటికి చూస్తున్నారు. అటుకేసి తల తిప్పాను. రైలు బళ్ళారి జూ పక్కనుంచి వెళుతోంది.

'ఓ ! అప్పుడే బళ్ళా రొచ్చేసిందా !' వాచీకేసి చూసుకున్నాను. నాలుగూ పదయ్యింది. పిల్ల లిద్దరూ పోటీ పడి జూలోని జింకల్ని లెక్క పెడుతున్నారు.

"ఇరవై ఆరు."

"కాదు, ఇరవై ఏడు."

"అవునవును ! అదిగో ఇంకొకటి ఆ చెట్టు కింద నీళ్ళు తాగుతోంది."

నాకు నవ్వొచ్చింది. కొద్దిగా పెద్దగా కనిపిస్తున్న అమ్మాయిని అడిగాను.

"నీ పేరేంటి పాపా?"

"సాహితి."

"చాలా బావుంది ! మరి నీ పేరు?" చిన్నమ్మాయిని చూస్తూ అడిగాను.

"నవలిక."

"ఓ ! నీ పేరు చాలా బావుంది." బహుశా వీరి పేరెంట్స్‌లో ఎవరో ఒకరు రచయితలై ఉండొచ్చు. చేతిలో ఒక్క పుస్తకం అయినా లేకుండా రైలు ప్రయాణం చేస్తున్న ఎల్లో శాల్టీకి సాహిత్యాభిమానం ఉంటుందని నా కనిపించలేదు. అందుకే అడిగాను.

"మీ అమ్మగారు కథలు రాస్తారా?"


"ఊహూ ! బొమ్మలు గీస్తారు." ఇద్దరూ ఒకేసారే చెప్పారు ! బహుశా సాహిత్యంతో పరిచయం ఉన్న వీళ్ళ బంధువు లెవరో సెలెక్ట్ చేసి ఉండా లీ పేర్లని. చాలా బావున్నాయ్, సాహితి - నవలిక !

రైలు బళ్ళారిలో ఆగడంతో కిందకు దిగాను. ఓ కప్పు కాఫీ తాగి, రైలు కదలగానే మళ్ళీ ఎక్కాను. లోపలికి రాగానే నే కూర్చున్న ఫోర్‌సీటర్‌లో కొత్త వ్యక్తి కూర్చుని కనిపించాడు. నా సీట్లో కూర్చుని అతనివైపు చూశాను.

మనిషి లావుగా, నల్లగా ఉన్నాడు. వదులుగా

ఉన్న తెల్లని పైజామా, తెల్లని జుబ్బా ధరించాడు. బాసింపట్టు వేసుకొని, ఒళ్ళో ఏదో సినిమా పత్రిక పెట్టుకొని శ్రద్ధగా చదువుతున్న వాడల్లా, నే నతనివైపు చూడగానే, నా వైపు చూసి ఓ చిర్నవ్వు విసిరేడు.

జవాబుగా మరో నవ్వు విసరడానికి ఓ క్షణం జంకాను. ఎందుకంటే... రైలు ప్రయాణాల్లో అయ్యే పరిచయాల్లో ఏవో కొన్ని తప్ప అన్నీ రైలు దిగగానే మరచిపోయేవే. వాటిల్లోనూ ఆ కాస్త సమయాన్ని సరదాగా గడిచిపోడానికి సహకరించేవి కొన్ని అయితే, అసలే దుర్భరమైన ప్రయాణాన్ని మరింత దుర్భరం చేసి, తల నొప్పి తెప్పించేవి కొన్ని. అందుకే సహ ప్రయాణికుల్ని పరిశీలించి, నా కున్న కొద్దిపాటి క్రైనసిక్స్, ఫిజియానమీ పరిజ్ఞానానికి సిక్స్త్ సెన్స్‌ని జోడించి, నే పరిచయం చేసుకోబోయేవారు బోరు కొట్టడంలో వీరులు కారని నిర్ధారణ చేసుకున్నాకే, మాటలు మొదలెడతాను. కాని ఇప్పు డీయన నే నింకా తనమీద నా విజ్ఞానాన్ని ప్రయోగించకముందే నన్ను చూసి నవ్వేడు. బహుశా ఈ విషయంలో ఈయన నాకన్నా ఫాస్ట్ అయ్యుండాలి.




మనల్ని చూసి ఒకరు ఏడుస్తున్నప్పుడు [అఫ్‌కోర్స్, ఆ ఏడుపు మన మంచికోసమే కావచ్చు] మనం ఏడవకపోయినా పరవాలేదు కాని, మనను చూసి ఒకరు చిరునవ్వు నవ్వినప్పుడు మనమూ నవ్వకపోవడం అమానుషం. అంటే మనుషులు చేసే పని కాదన్న మాట. అందుకే ఏమైతే అదే అయ్యిందని ధైర్యం చేసి నవ్వాను.

నేను నవ్వగానే చేతిలోని పత్రికని ముందుకు చూపుతూ - "చూస్తారా?" అన్నాడు. ఆయన అలా చూపుతుంటే ఆ పత్రిక ముఖచిత్రం కనపడింది. ఓ ప్రముఖ హీరో, ఓ వర్ధమాన హీరోయిన్ కలసి అందమైన పూదోటలో గెంతుతున్నారు. హీరోయిన్ ముప్పాతిక శరీరం నగ్నంగా ఉంది. ఆమె ధరించాల్సిన వస్త్రాల్ని కూడా తనే ధరించినట్టు అతను గ్రే కలర్ సఫారీ డ్రెస్‌లో ఉన్నాడు.

"వద్దండీ !" అన్నాను, కొద్దిగా ఇబ్బందిగా, ముఖం పెట్టి; నే నా టైపు పత్రికలు చదవడం మానేసి చాలా రోజులైంది.

"ఏమిటి? మీకు జోకులంటే ఇష్టం ఉండదా?"

"జోకులంటేనా? ఇష్టమే." ఆయన దేనిగురించి మాట్లాడుతున్నాడో నా కర్థం కాలేదు.

"మరి జోకుల పత్రిక చదవనంటా రేమిటి?"

ఆయన చేతిలోని పత్రిక వంక అనుమానంగా చూస్తూ అన్నాను. "అది... ఏదో సినిమా పత్రికలా ఉంది."

"అఫ్‌కోర్స్ ! కాని జోకులు బావుంటాయ్."

"సినిమా పత్రికలో జోకులా?"

ఆయన నా పక్కగా జరుగుతూ అన్నారు. "మీ రెప్పుడూ చదివినట్టు లేదే... ఉదాహరణకి ఈ వార్తను చదవండి" పత్రికను నా కందించాడు.

ఆయన చదవమన్న వార్తను చదివాను. 'రూమర్స్‌ను నమ్మకండి' అన్న హెడ్డింగ్ కింద ఇలా ఉంది. "... త నీ మధ్య అమెరికా వెళ్ళినప్పుడు అక్కడ, తన కింది పెదవి సైజ్‌ను ప్లాస్టిక్ సర్జరీ ద్వారా తగ్గించుకుందని కొన్ని బోగస్ పత్రికలు రాశాయనీ, కాని ఇది నిజం కాదనీ, కేవలం ఒక పుకారనీ, అలాంటి అవసరం తనకు లేదని ప్రముఖ నటీమణి కుమారి శ్రీవిక తెలియజేశారు."

ఇందులో నాకు జోకేం ఉందో అర్థం కాలేదు. ఆ మాటే అన్నాను.

"నిజమే ! ఇందులో జోకేం లేదు. కాని మీకు తెలుసా ! శ్రీవిక పెదవికి ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుందన్న విషయాన్ని నెల క్రితం మొట్టమొదటిసారిగా ప్రచురించిన పత్రిక కూడా ఇదే !"

అప్పు డొచ్చింది నాకు నవ్వు. శ్రీవిక సర్జరీ చేయించుకున్న వెంటనే ఆ వార్తను ఈ పత్రిక ప్రచురించింది. కాని ఆ విషయాన్ని ఆమె తిరస్కరించేసరికి భట్రాజు గిరికి అంకితమైన ఈ పత్రిక, చచ్చినట్టు ఆ వార్తను కుడా ప్రచురించక తప్పలేదు. 'తప్పదు' అని అనుకున్నప్పుడు ఆ ఎడిటర్ ముఖం ఎలా ఉందో ఊహించుకుంటే నవ్వొస్తుంది. జోక్స్‌లో ఇవో రకం. వీటిని అర్థం చేసుకోడానికి కొంత అనలైజేషన్ అవసరం.

ఆయన రెండు పేజీలు తిప్పి మరో వార్తను చూపించాడు. "జవ్వని జన్మదిన వేడుకలు" అన్న హెడ్డింగ్ కింద ఇలా ఉంది.

"పదహారేళ్ళ వయసులో తొలిసారిగా 'పదహారేళ్ళ ప్రాయం' సిన్మా ద్వారా తెలుగు తెరకు పరిచయమై, తొలి సినిమాతోనే ప్రముఖుల ప్రశంస లందుకొని, గత ఆరేళ్ళుగా ఎన్నో విభిన్న పాత్రల్లో జీవించి, సినీకళామ తల్లికి ఎనలేని సేవ చేసిన ప్రఖ్యాత తారామణి, కుమారి జవ్వని తమ పందొమ్మిదవ జన్మదినోత్సవాన్ని నేడు రమ్యా స్టూడియోలో వైభవంగా జరుపుకున్నారు." నాకు నవ్వాగలేదు.

"ఇటువంటివి ప్రతి పత్రికలోనూ ఖచ్చితంగా రెండో మూడో ఉంటాయ్. ఇప్పుడు చెప్పండి ఇది జోకుల పత్రిక అవునా? కాదా?"

నవ్వాపుకుంటూ అన్నాను. "నిజమే !" సరదాగా ఆయన మాట్లాడుతున్న తీరు నచ్చింది. 'ఫరవాలేదు, ఈ ప్రయాణం సాఫీగానే సాగేట్టుంది. ఇంతకీ ఈయన ఎందాకా వెళతారు?'

"మీ ప్రయాణం ఎందాకా అండి?"

"గుంతకల్ వరకే... ! మీరు గుంటూరుకా?"

"కాదండీ - మద్రాసుకు."

"బంధువు లింటికా?"

"ఊహూ ! సందీప్‌ని ఒక ఫ్రెండ్ ఉన్నా డక్కడ. ఎల్లుండి నాకు జి. ఐ. సి. రిటన్ టెస్ట్ ఉంది, అందుకని."

"ఓహో గ్రాడ్యుయేట్ వన్న మాట."

"అవును. బి. ఎస్సీ. మాత్స్ !" ఆయన ఏదో అడగబోతూంటే పక్కనుంచి "మీరు మద్రాస్‌కా?" అన్న మాటలు వినిపించాయ్.

తల తిప్పి చూశాను. ఎల్లో శాల్తీ నాకేసి చూస్తూన్నాడు. "అవునండి" అన్నాను. ఆ పదంలోనే 'ఏమిటి' అన్న అర్థం ధ్వనించేలా.

"రిజర్వేషన్ చేయించుకున్నారా?"

"ఆఁ ! మీరు?"

"చేయించాను" కొన్ని క్షణాలు ఆగి, ఓ గుటక వేసి అడిగాడు.

"మనం రిజర్వేషన్ చేయించింది గుంతకల్ నుంచి మద్రాస్ వరకూ కదూ?"

"అవును. మద్రాస్ మెయిల్‌కు బెర్త్ రిజర్వ్ చేయించాం కదండి. అది బాంబే నుంచి గుంతకల్‌కు ఏడు గంటలకు వచ్చి, ఏడూ ఇరవైకి బయలుదేరుతుంది. ఈ అమరావతి ఆరులోపే గుంతకల్ చేరుతుంది. మనం ఇది దిగి అది ఎక్కాలి" వివరించాను.

"అంటే హాస్‌పేట నుంచి గుంతకల్‌కి మనకు రిజర్వేషన్ లేనట్టేగా?"

"లేనట్టే."

"మరి ఇది రిజర్వేషన్ కంపార్ట్‌మెంట్ కదా, మనం ఇందులో ఎక్కినందుకు టీ.సీ. అభ్యంతరం చెప్పడా?" అత ని కొచ్చిన సందేహానికి నాకు కొద్దిగా నవ్వొచ్చింది. ఆ నవ్వుని అతని కంట పడకుండా దాచేసి చెప్పాను.

ఇప్పుడు టీ. సీ. వచ్చి 'మీకు రిజర్వేషన్ లేదు. జనరల్ కంపార్ట్‌మెంట్‌లో ఎక్కండి అంటే ఏం చేయాలిరా దేవుడా' అని ఆలోచిస్తున్నట్టుంది అతని ముఖం. ఇదే మొదటిసారి కాబోలు ఈ రూట్‌లో ప్రయాణించడం.

ఇంతలో ఓ విషయం గుర్తొచ్చింది. హాస్‌పేట నుంచి మద్రాసుకు కేవలం నాలుగు బెర్తులు మాత్రమే ఉన్నాయి. వాటిలో నే నొకటి చేయించాను. మిగిలింది మూడు. కాని వీళ్ళు నలుగు రున్నారు. ఎలా?

"మీరు రిజర్వేషన్ ఎక్కడి నుంచి చేయించారు?"

"హాస్‌పేట నుంచి."

వెంటనే అడిగాను. "ఎన్ని బెర్తులు?"

"మూడే." నే ననుకున్నది కరెక్టే !

"మరి మీ రున్నది నలుగురు కదా !"

'అవును. అదే ఆలోచిస్తున్నాను. మా తమ్ముడు.

ఆంధ్రా బాంక్‌లో పని చేస్తున్నాడు. ఈమధ్యనే హొస్‌పేటకు ట్రాన్స్‌ఫర్ అయింది. చూసి వెళదామని వచ్చాం. మా అమ్మగారు కొన్నాళ్ళు ఇక్కడే ఉంటా నన్నారు. సరేనని, నాకు, పిల్లలకు రిజర్వేషన్ చేయించాను. తీరా నిన్న తనూ నా కూడా వచ్చేస్తానని అన్నారు. వెంటనే ఇంకో బెర్త్ కోసం ప్రయత్నించాం గాని, దొరకలేదు." విచారంగా చెప్పా డతను. ఇందాక అత డంత సీరియస్‌గా దేని గురించి ఆలోచిస్తున్నాడో అర్థమైంది.

"గుంతకల్లో ప్రయత్నించండి, మరో బెర్త్ దొరకవచ్చు" చెప్పాను.

"దొరుకుతుం దంటారా?"

"దొరకవచ్చు, ప్రయత్నిద్దాం."

అతను మళ్ళీ గంభీరంగా మారిపోయాడు. ముఖంలో విచారరేఖలు గోచరించాయ్. ఇక నీతో మాట్లావలసిం దేమీ లేదన్నట్టుగా కిటికీలోంచి బయటికి చూడసాగాడు. రిజర్వేషన్ లేకుండా ప్రయాణించడం కాస్త రిస్క్‌తో కూడుకున్న పనే గాని, అతను విచారిస్తున్నంత, విచారించాల్సిన విషయం కా దనిపించింది. ఆ తరవాత అత నేం మాట్లాడకపోయేసరికి లావుపాటి వ్యక్తివైపు తిరిగి అడిగాను.

"మీ నేటివ్ గుంతకల్లేనా?"

"కాదు... చాలా ఏళ్ళ క్రితమే అక్కడ స్థిరపడ్డాం."

"ఏం చేస్తుంటా రక్కడ?"

"మధూ ఫిలిమ్ డిస్ట్రిబూటర్స్ ఓనర్ని"

"ఓ ! మధూ మీ పేరా?"

"కాదు. మా అబ్బాయి పేరు. నా పేరు చిదంబరం."

"బళ్ళారిలో మీకు బంధువు లున్నారా?" ఆయ నడిగిన ప్రశ్ననే అడిగాను.

"లేరు. కంప్లిలో పని ఉండటంతో వచ్చాను."

"కంప్లిలోనా?" కంప్లిలో మా మామయ్య వాళ్ళున్నారు. బళ్ళారి నుంచి ముప్పై మైళ్ళ దూరంలో ఉం దది.

"అవును."

"ఏం పని?"

"నెల క్రితం ఓ థియేటర్ వాళ్ళు మా నుంచి ఒక ఫిలిం బాక్స్ పట్టుకెళ్ళారు. పదిహేను రోజుల్లో రిటర్న్ చేస్తామన్నారు. కాని ఇరవై రోజులైనా చేయలేదు. కారణం ఏమిటని ఉత్తరం రాశాం. ఒకోసారి కలెక్షన్స్ బావుంటే అలాగే ఎక్స్‌టెండ్ చేస్తూంటారు. కాని పది రోజులైనా మా ఉత్తరానికి జవాబు రాలేదు. అందుకే నేనే బయలుదేరి వచ్చాను." అర్థమైందన్నట్టుగా తల ఊపి అడిగాను.

"బాక్స్ రిటర్న్ చేశారా మరి? ఇంతకీ ఏ థియేటర్ అది?" మొదటి ప్రశ్నకు కాకుండా రెండో ప్రశ్నకు జవా బిచ్చా డాయన.

"భరత్."

"భారత్."

"కాదు భరత్ !"

"భరతా? ఆ పేరుగల టాకీస్ ఏదీ కంప్లిలో ఉన్నట్టు లేదే?" సాలోచనగా అన్నాను.

"అవును, కాని ఆ విషయం నా కీ రోజే తెలిసింది."

"అంటే?" ఆశ్చర్యంగా అడిగాను.

"అంటే ఎవరో లేని థియేటర్ పేరు చెప్పి బాక్స్ పట్టుకెళ్ళారు."


"మోసం ! అసలు మీరు బాక్స్ ఇచ్చేముందు, అక్కడ ఆ థియేటర్ ఉందో లేదో కనుక్కోరా?"

"కనుక్కుంటాం. కాని ఈమధ్య ఈ వ్యవహారాలన్నీ మా అబ్బాయి చూసుకుంటున్నాడు. వాడికి ఇందులో అనుభవం లేదు. ఇంతకుముందు ఇదే వ్యక్తి మూడుసార్లు బాక్సులు పట్టుకెళ్ళాడట. తమది కొత్త థియేటర్ అని చెప్పాడట. అందుకే బాక్స్ విలువకు సమానంగా అడ్వాన్స్ కట్టించుకొని బాక్స్ ఇచ్చాడట. నమ్మకం కుదరటంతో ఈసారి అడ్వాన్స్ కట్టించుకోకుండానే బాక్స్ ఇచ్చేడట.

"వెరీ బాడ్ ! మ రిప్పుడెలా? బాక్స్ పోయినట్టేనా?"

"ఈ చుట్టుపక్కలే ఏదో ఒక టాకీస్‌కి సంబంధించిన వ్యక్తి అయ్యుండా లతను. ఇంతకుముం దతడు పట్టుకెళ్ళిన సినిమాలు ఎక్కడ ఆడాయో ఆచూకీ తీయాలి. అలాగే ఇప్పు డీ సినిమా ఎక్కడ ఆడుతుందో కనుక్కొని పరిశోధించాలి."

"ఫలితం ఉంటుందా?" ఆయన కొద్దిగా నవ్వేడు.




"ఉండొచ్చు: ఉండకపోవచ్చు."

"ఎంత ఉంటుంది ఆ బాక్స్ ఖరీదు?"

"పదిహేను వేల చిల్లర."

పది సెకండ్ల మౌనం తరువాత అడిగాను - "ఇంతకీ ఏ సినిమా బాక్స్ అది?" ఆయన నవ్వాడు. నవ్వి చెప్పాడు. నాకు నవ్వు రాలేదు.

కాసేపు మౌనంగా ఉండిపోయాను. అప్పటికే రైలు గుంతకల్‌ను సమీపించడంతో మా సంభాషణ అక్కడితో ఆగిపోయింది.

రైలు దిగాక ఆయనకు గుడ్ బై చెప్పి, ఉన్న ఒక్క ఎయిర్ బాగ్‌నూ భుజాన వేసుకొని, ఎంక్వయిరీ కాబిన్ వైపు నడిచాను. రైలు రైట్‌టైమ్‌కే వస్తోందని నిర్ధారించుకున్నాక, ఆరో ప్లాట్‌ఫాం మీదికి అడుగెట్టాను.

టైం చూసుకున్నాను. రైలు రావడానికి గంట పైగా టైం ఉంది. పక్కనే ఉన్న "జెంట్స్ వెయిటింగ్ హాలొ" లోపలికి అడుగు పెడుతూండగా, హడావిడిగా వస్తున్న ఎల్లో శాల్తీ కనిపించాడు.

"ట్రైన్ ఇంకా రాలేదు కదండీ?" అన్నాడు నన్ను చూడగానే.

"లేదు ఏడుగంటలకు వస్తుంది. ట్రైన్ రాగానే టీ.సీ.ని కలవండి. ఒక్క సీటే కదా, ఎక్కడో చోట ఎడ్జెస్ట్ చేస్తాడు."

"అంటే మన కంపార్ట్‌మెంట్‌లోనే దొరకదా?" కొద్దిగా ఆశ్చర్యంగా అడిగాడు.

"దొరికే అవకాశాలు చాలా తక్కువ. దొరకదనే చెప్పొచ్చు. అయినా సీటంటూ దొరకాలే గాని, ఎక్కడైతే నేంటండి? అసలు ఈ సీజన్‌లో బెర్త్ దొరికితే మనం అదృష్టవంతులమే."

నా మాటలకు కొద్దిగా ఫీలైనట్టు కనిపించాడు. తనలో తాను అనుకున్నట్టుగా గొణిగాడు. "బెర్త్ దొరికినా, చిన్నపిల్లల్నీ ముసలి తల్లినీ వదిలి నే నెక్కడో ఎలా ఉండను?" విచారంగా అత నన్న మాటలకు అతనిపైన కాస్త జాలేసింది. వెంటనే చెప్పాను.

"దానికేం ఉందండి? నే నెలాగూ వీరితో పాటు ఉంటానుగా? మీరు నిశ్చింతగా ఉండొచ్చు. 'మీకు మరీ అంత భయంగా ఉంటే నా బెర్త్ మీరు తీసుకోండి. మీ బెర్త్‌ను నే నుపయోగించుకుంటాను."


నా మాటలకు అతని ముఖం విప్పారింది. వెంటనే మళ్ళీ అనుమానంగా, అమాయకంగా అడిగారు - "మీ వయస్సుకీ, నా వయస్సుకీ పది, పన్నెండేళ్ళు తేడా ఉంది కదా, మరి టీ.సీ.కి తెలిసిపోదూ మనం బెర్త్‌లు మారినట్టు?"

"తెలుస్తుందండి. తెలిసినా ఆయ నేమీ అనరు. కాబట్టి మీ రా విషయాన్ని గురించి ఆలోచించకండి. టీ.సీ. రాగానే ఓ బెర్త్ సంపాదించండి. దట్సాల్" చెప్పి, ఇక అక్కడ ఉండకుండా కాంటీన్ వైపు దారితీశాను.

నా కనుమానంగానే ఉంది, అతనికి బెర్త్ దొరకదేమోనని. ఆఖరికి నే ననుకున్నట్టుగానే అయింది. గుంతకల్ రైల్వే స్టేషన్ని ఓ చుట్టు చుట్టి, కాఫీ తాగి వచ్చేసరికి మద్రాస్ మెయిల్ వచ్చి ఉంది. ఎల్లో శాల్తీకి బెర్త్ దొరకలేదు.

అతని ముఖం దీనంగా ఉంది. సర్వం కోల్పోయినవాడిలా ఉన్నా డతను. తల్లిని, పిల్లల్ని ట్రైన్‌లో వారి సీట్లలో కూర్చోబెట్టేడు. కిక్కిరిసిన జనంతో మరో మనిషి నిలబడటానికి కూడా ఖాళీ లేనంత ఇరుకుగా ఉన్న జనరల్ కంపార్ట్‌మెంట్ వైపు భయంగా చూస్తున్నాడు.

అతన్ని చూస్తే మళ్ళీ జాలేసింది. జాలి పడటం మినహా నే నేం చేయగలను? పదహార్రూపాయలు అదనంగా చెల్లించి పది



రోజులు ముందుగా రిజర్వ్ చేయించుకున్న నా 'వరువు'ను త్యాగం చేయలేను కదా !

నాలుగు నిముషాలు గడిచాక ఓ ఆలోచన వచ్చింది. ఆలస్యం చేయకుండా అతని దగ్గర కెళ్ళాను. నన్ను చూడగానే విచారంగా అన్నాడు.

"బెర్త్ దొరకలేదండి. ఏమవుతుందని భయపడ్డానో అదే జరిగింది. ప్లీజ్ ! పిల్లల్ని అమ్మగార్నీ కొంచెం కనిపెట్టుకొని ఉండండి. నే నెలాగో జనరల్ కంపార్ట్‌మెంట్‌లో అడ్జెస్ట్ అవుతాను."

"మీరు జనరల్ కంపార్ట్‌మెంట్‌లో అవస్థపడాల్సిన అవసరం లేదు. ఓ పని చేద్దాం."

"ఏమిటి?" ఆశతో అడిగాడు.

"మీ అమ్మగారికి టికెట్ తీసుకున్నారు కదా?"

"ఆఁ ! తీసుకున్నాను."

"దట్సాల్ ! ఇప్పుడు మనమంతా ఒకేచోట కూర్చొని ప్రయాణిద్దాం."

"ఎలా? మా అమ్మగారికి రిజర్వేషన్..."

"లేకపోయినా ఫరవాలేదు. నా బెర్త్ నంబర్ తొమ్మిది. అంటే మీవి పది, పదకొండు, పన్నెండు అయ్యుండాలి..."

"అవును."

"సో, ఒకవైపు నున్న ఫోర్ సీటరూ, దానిపై నుండే రెండు బెర్తులూ మీవే నన్నమాట. కాబట్టి పిల్ల ల్నిద్దర్నీ కింది బెర్తులో ఒకవైపుకు ఒకరి తలా మరొకరి కాళ్ళూ వచ్చేలా పడుకోబెట్టండి. పై రెండు బెర్తుల్ని మీ అమ్మగారు, మీరు ఉపయోగించండి..."

"ఇదెలా సాధ్యం? టీ.సీ..."

"ఒప్పుకుంటాడు. మనం ఒప్పిస్తాం..."

కాసేపు ఆలోచించి అన్నాడు - "సరే పదండి. టీ.సీ.ని కలుద్దాం."

"వద్దు. టీ.సీ.యే మన వద్దకు వస్తాడు."

"ఎప్పుడు?"

"రైలు కదిలినప్పుడు."

సరిగ్గా ఏడు ఇరవైకి రైలు కదిలింది; కదిలిన పావుగంటకు మా దగ్గరకు వచ్చాడు టీ.సీ. నే ననుకున్నట్టుగానే 'గయ్' మన్నాడు మేం చెప్పింది విని. అంటాడని ముందుగానే తెలుసు కాబట్టి కంగారు పడలేదు.

ముఖానికి జాలి తొడుగుని తొడుక్కుని - "సార్, అనుకోని ప్రయాణం. చిన్నపిల్లలు, ముసలావిడ, మూడు బెర్తులు. అడ్జెస్ట్‌మెంట్..." అంటూ రెండు నిముషాలు ఫ్లాష్‌బాక్‌న్ని చెప్పి చివరికి అన్నాను. "సార్ ! మీకే మీ చిన్నపిల్లలతో, ముసలి అమ్మగారితో ఇలాంటి పరిస్థితే ఎదురైతే ఏం చేస్తారు సార్? మా పరిస్థితిని మీవైపుగా ఆలోచించి చెప్పండి సార్. అప్పుడూ ఇలాగే కాదంటారా?"

టీ.సీ. గంభీరంగా టికెట్స్ కేసి చూస్తుండిపోయాడు. నే నో నిట్టూర్పు వదిలి, మళ్ళీ వెనక చెప్పిందాన్నే ఇటు దటు, అటు దిటు చేసి మరో రెండు నిముషాలు లాగిద్దా మనుకుంటూండగా టీ.సీ. అన్నాడు.

"సరే ! నే చెప్పేది చెప్పాను. ఆ తరవాత మీ ఇష్టం. ఇక్కడ నే నొప్పుకున్నా తరవాత వచ్చే టీ.సీ. ఒప్పుకోడు మరి."

"థాంక్స్ సార్ !" ఎల్లో శాస్త్రీ, నేను ఒకేసారి అన్నాం. ఏదో త్యాగం చేస్తున్నట్టు అక్కడి నుండి కదిలాడు టీ.సీ.

"మరో టీ.సీ. రాడు. వచ్చినా మిమ్మల్ని డిస్టర్బ్ చేయడు. ఇక దాని గురించి ఆలోచించడం మానేయండి." ఎల్లో శాస్త్రీ నుద్దేశించి చెప్పాను.

"చాల్లా థాంక్స్ బాబూ" అతని ముఖం వెలిగిపోతోంది.

ఇంతలో రైలు 'గుత్తి'లో ఆగింది. మీల్స్ స్టేషన్ అది. ఇంటి నుంచి తెచ్చుకున్న పులిహోరకి, గుంతకల్లులో తీసుకున్న ఆమ్లెట్ నంజుకుంటూ భోజనం పూర్తి చేశాను. గుత్తి నుంచి రైలు బయలుదేరగానే పైకెక్కి పడుకున్నాను.

రైలు వేగంగా వెళుతోంది. ఆ కుదుపులకి ఊయలలో ఊగుతున్నట్టూ, వాటి తాలూకు సంగీతం జోల పాడుతున్నట్టూ ఉంది.

మెల్లగా నిద్రలోకి జారుకుంటూంటే ఎందుకనో హఠాత్తుగా చిదంబరం గుర్తొచ్చాడు. నవ్వుతూండే ఆయన ముఖం గుర్తొచ్చింది. పదిహేను వేలు పోయాయని తెలిసినా ఎంత మామూలుగా ఉండగలిగా డాయన? జీవితం మీద ఎంతో అధికారం ఉంటే గాని అది సాధ్యం కాదు. గొప్ప పర్సనాలిటీ.

ఆ స్థాయికి ఎదగాలనే నా ప్రయత్నమూను. గత రెండేళ్ళలో చాలావరకు ఎదిగాననే నా అభిప్రాయం. రెండేళ్ళ కిందటి నాకు, ఇప్పటి నాకు, చాలా తేడా ఉంది. అప్పటి నేను పిరికివాణ్ణి. కొత్త వ్యక్తులతో మాట్లాడటానికే భయపడేవాడిని. ఆత్మన్యూనతా భావానికి బానిసైన వాణ్ణి; నిరాశా నిస్పృహలకు బలైనవాణ్ణి. చిన్న చిన్న సమస్యల్నే భూతద్దంలో చూసి భీతిచెందేవాణ్ణి.

అలాంటి నేను, నేడు నాకు కావలసిం దేదైనా సరే సాధించగల ననుకునే స్థితికి ఎదిగాను. అందు క్కారణం ఆయన.

ఎవరి పేరు వింటే నాలో ఉత్సాహం పెల్లుబుకుతుందో...

ఎవర్ని తలుచుకుంటే నాలో కొండంత ధైర్యం జనిస్తుందో...

ఆయన... పోరంకి జానకీపతి ! నా అభిమాన రచయిత !

నాకే కాదు, నాలాంటి లక్షలాది తెలుగువారికి ఆరాధ్య రచయిత ! మూడేళ్ళ క్రితం తెలుగు నవలాకాశంలోకి తారాజువ్వలా దూసుకొచ్చేడు; అప్పటి నుంచి ధ్రువతారలా వెలుగొందుతున్నాడు.


పదేళ్ళ పిల్లల నుంచి అరవై ఏళ్ళ వృద్ధుల వరకూ అటు క్లాస్‌ని, ఇటు మాస్‌ని ఆకట్టుకున్న ఏకైక ఆధునిక తెలుగు రచయిత పోరంకి జానకీపతి.

ఆయన సృష్టించిన ప్రతి పాత్ర ఒక్కో ఆణి ముత్యం. అన్నీ ధైర్యానికి ప్రతీకలు. సాహసానికి ప్రతిరూపాలు. మిన్ను విరిగి మీద పడ్డా చలించవు; తలలు నరికినా నవ్వుతూనే ఉంటాయ్.

# ఎవరు?

ఖాయిలా పడ్డ సముద్రాలు
కొడిగట్టిన అగ్నిదీప శిఖరాలు
పరాకు తొడిగిన ఆరాటాల తూటాలు
చచ్చుబడ్డ కన్నెర్రల జీరలు
ఆవేశం లేని సన్నివేశాలు
ఎవరు ? ఎవరు ? ఎవరు ?
సంకటాల సంకలనాలు
అత్యాచార స్వంతదార్లు
అగచాట్ల అడకత్తెరలో పోకలు
అసుఖవ్యాధి పీడితులు
అన్యాయాలకు లోగిళ్ళు
అనర్థాల నానార్థ చంద్రికలు
ఉపద్రవాల కౌగిటిలోని విటులు
పక్షపాతాల పక్షవాత అంగీయులు
ఎవరు ? ఎవరు ? ఎవరు ?
వ్యవస్థనోటి పుక్కిలింతలు
శిష్టసమాజం కసిరిన శాపగ్రస్తులు
సీతశతకాలకు కృతిపతులు
ధర్మశాస్త్రాలకు వేసిన వెర్రితలలు
కావ్యాల్లో చొప్పించిన ప్రక్షిప్తాలు
ఇజాలు తడుముకునే భుజాలు
పన్నులకు గుచ్చిన పిన్నులు
సమాజానికి పెట్టిన హంసపాదులు
వాక్యాలకు చుట్టిన బ్రాకెట్లు
ప్రశ్నార్థకాల క్రింది చుక్కలు
మీటలు లేని వీధి దీపాలు
ఎవరు ? ఎవరు ? ఎవరు ?

-ప్రసూన




కథలు మనుషుల్ని మార్చలేవన్న అభిప్రాయం కొందరికి ఉండొచ్చు గాని, అది నిజం కాదు. అందుకు నేనే ఒక ఉదాహరణ. ప్రతి కథా ప్రతి మనిషినీ ఉన్నపళంగా మార్చలేకపోవచ్చు. కాని మంచి కథ కొందర్నయినా ఆలోచింపజేస్తుంది. ఆలోచనే కదా మరి మార్పుకు మూలం.

చిదంబరంగారు అంత ఉన్నత స్థాయికి ఎలా ఎదిగాడో గాని, నేను మాత్రం పోరంకి వారి రచనల ద్వారానే ఆత్మవిశ్వాసాన్ని ధైర్యాన్ని పొందగలిగాను. నేనే కాదు, ఎల్లో శాల్తీ లాంటి వారెవరైనా సరే, ఆయన నవలల్ని చదివాక వెనక ఉన్న స్థితినే ఉండలేరు. అంత బలమైంది ఆయన కలం. ఇది నిజం.

ఆయన్ని కలవాలని నాకు ఎప్పటి నుంచో ఉంది. కాని వీలులేక కలవలేకపోయాను. ఇప్పుడీ పనిమీద మద్రాస్ వెళుతూన్నాను. కాబట్టి ఏ అవకాశాన్ని వదులుకోకూడదు. ఆయన్ని ఎలాగైనా కలవాలి. ఆయ నుండేది విల్లీవాకంలో. అదెక్కడుందో? సందీప్ ఉండే రాయపేట నుంచి ఎంత దూరంలో ఉందో? సందీప్‌కు తెలిసే ఉంటుంది. వాడికి మద్రాసంతా కొట్టిన పిండి. వాణ్ణి తీసుకువెళ్ళాలి. ఎల్లుండి రిటన్ టెస్ట్ అయ్యాక సాయంత్రం వెళితే బావుంటుంది.

మే మెళ్ళిన సమయానికి ఆయన ఇంట్లో ఉంటాడో, ఉండడో ! ఒకవేళ ఉన్నా బిజీలో నన్ను పలకరిస్తాడో లేదో? లేదు... ! ఆయ నలాంటి వారు కాదు. ఉంటే మాత్రం తప్పక పలకరిస్తాడు. ఎలా మాట్లాడతా రో?

ఏం మాట్లాడా లాయనతో? ఆయన రచనల గురించే మాట్లాడాలి. నచ్చిన వాటి గురించి, నచ్చని వాటి గురించి, రాబోయే ఆయన నవలల గురించి చిన్న సైజు ఇంటర్వ్యూ చేయాలి. ప్రశ్నలు సిద్ధంగానే ఉన్నాయ్. మరీ ఎక్కువసేపు ఉండకూడదు. ఎంతో విలువైన ఆయన సమయం మావల్ల వృథా కాకూడదు మరి !

ఆలోచనలతో నిద్రలోకి జారుకున్నాను. మెలకువ వచ్చేసరికి అయిదూ ముప్పై అయింది. కిందకు చూశాను. ఎల్లో శాల్తీ, పిల్లలూ, ఘనలావిడా అప్పుడే లేచి మధ్య బెర్త్ దించేసి ఫోర్ సీటర్‌లో కూర్చుని ఉన్నారు.

నేనూ లేచొచ్చి ఓ పక్కగా కూర్చున్నాను. ఎల్లో శాల్తీ విష్ చేశాడు.

"టీ.సీ. ఏం రాలేదు కదా !" అడిగాను.

"లేదు" నవ్వాడు. నేనూ నవ్వి కిటికీలోంచి బయటికి చూశాను.

అప్పుడే రైలు మద్రాసు ప్రాంతంలో ప్రవేశించింది.

తెలతెలవారుతోంది. చల్లని గాలి వీస్తోంది.

నగర జనసంద్రం యథావిధిగా బిజీ అవడానికి ఉద్యుక్తమవుతోంది. ఎటు చూసినా పెద్ద పెద్ద అక్షరాలతో తమిళంలో బోర్డులు కనపడుతున్నాయి.

ఆ ఇళ్ళే ఇవి, ఆ మనుషులే వీరూనూ, అక్కడిదే ఈ గాలి, అదే వాతావరణం ఇక్కడానూ. కాని ఏదో కొత్త లోకంలోకి అడుగిడుతున్న భావన కలుగుతోంది మద్రాసులో అడుగిడుతూంటే.

ఇంతలో రైలు స్లో అవసాగింది. ఎల్లో శాల్తీ వాళ్ళు లగేజీ చేత్తో పట్టుకొని నిలబడ్డారు. అంటే వీళ్ళిక్కడ దిగుతారు కాబోలు. ఏ స్టేషనో?

తల బయటికి పెట్టి చూశాను. 'పెరంబూర్' అని బోర్డు కనిపడింది.

"వెళ్ళొస్తాం అంకుల్" తల తిప్పాను. నవలిక, సాహితి !

"గుడ్ బై" చెప్పాను చిరునవ్వుతో.

రైలు ఆగింది. దిగబోతూ అన్నాడు ఎల్లో శాల్తీ - "మీరూ రాకూడదూ మా ఇంటికి? భోంచేసి వెళ్ళొచ్చు."

"నో ! థాంక్స్ ! మా ఫ్రెండ్ స్టేషన్‌కు వస్తాడు. మళ్ళీ నేను కనపడకపోతే కంగారు పడతాడు."

"అయితే, పరీక్ష రాశాక రండి. ఇదిగో నా అడ్రస్" అత నందించిన విజిటింగ్ కార్డ్ అందుకుంటూ చెప్పాను - "తప్పకుండా రావడానికి ప్రయత్నిస్తాను."

"ప్రయత్నించడం కాదు, రావాలి" రైలు దిగుతూ అన్నాడు. అతను దిగగానే రైలు కదిలి, వేగా న్నందుకుంది.

పరవాలేదు. చేసిన సహాయానికి కృతజ్ఞత ప్రదర్శించాడు. వీలైతే వెళ్ళాలి వా. ళ్ళింటికి.

ఇంతకీ ఎక్కడో ఇత నుండేది?

విజిటింగ్ కార్డ్ కేసి చూశాను. అంతే నాలుగొందల నలభై వోల్టుల కరెంట్ షాక్ తిన్నట్టు ఉలిక్కిపడ్డాను. నా బుర్ర గిర్రున తిరగసాగింది.

పాల నురుగులాంటి తెల్లటి కార్డ్ ముక్కమీద స్క్రీన్ ప్రింట్‌లో గులాబీ రంగు అక్షరాలు స్పష్టంగా కనిపిస్తున్నాయ్.

"పోరంకి జానకీపతి, నావెలిస్ట్,<br>
నంబర్ 1 / 81,<br>
సిక్త్ అవెన్యూ<br>
విల్లివాకం,<br>
మద్రాస్ - 600 049."

నిజమా? ఇది నిజమేనా? నిజమే నంటూంది చేతిలోని విజిటింగ్ కార్డ్. సంవత్సరంన్నర క్రితం సాహిత్య అకాడమీ బహుమతి లభించిన సందర్భంగా ఏదో పత్రికలో ప్రచురితమైన పోరంకి జానకీ పతిగారి ఫోటోను గుర్తు తెచ్చుకున్నాను. అవును. ఆ ఫోటోకీ, ఈ ఎల్లో శాల్తీకీ పోలిక లున్నాయ్. పోలిక లుండటం కాదు, ఇద్దరూ ఒకరే. అప్పుడు మీసా లుండేవి. ఇప్పుడు లేవు. అంతే తేడా.

అయితే నిజమేనా?

చిన్న విషయాలకే భయపడుతూ, గంటల తరబడి బాధపడిన ఈ ఎల్లో శాల్తీయే నన్ను తీర్చిదిద్దిన పోరంకి జానకీపతా ? ప్రతి ఆంధ్రుడూ మా రచయిత అంటూ గర్వంగా చెప్పుకొనే పోరంకి జానకీపతి ఇంత చిన్న సమస్యకే క్రుంగిపోయే ఇంబెసైల్ ఫెలోనా? నో !

ఈ నిజాన్ని నే నింకా జీర్ణించుకోనేలేదు.

రైలు మద్రాసు సెంట్రల్లో ఆగింది. ★

